# కొమరయ్య కోన

సిరికాకుళం బంగనబయలుగా ఉంటూన్న అలనాడు, పాటిసీమను పరగణాచేసి, కోట కట్టించి అష్టభుజాలుగా పేటలు కట్టించి, వేణ్ణానదిగట్టు కట్టుదిట్టము కాంగా కన్నానినంతమేర తోటలునాటించి – ప్రజలు తనకు తోడుగా ప్రజలకు తాను నీడగా, ఏలికగా, ఎకిమీడుగా, ఆదరించే తండ్రిగా, కొలుచుకునే దైవంగా, సుఖపడుతూ సుఖపెడుతూ, కరువూ కాటకం పొలిమేరలదరికి రాకుండా తరిమికొడుతూ, మూడు పూవులకు ఆరుకాయలు కాయించిన దేసిరాజు యిలువాసి పదునారు తరాలుగా, ఆ కలిమి, అల్లంతబలిమి, యినుమిక్కిలిగా పెంపొందంగా –

అలనాడు అటు ఏడుతరములవారికీ, పేరుతెచ్చిన మనుమంచిరాజు, కోనలో తొలికోడికూత వినంగనే మేలుకొని 'పంచవన్నె పులుగురౌత! మంచుకొండ మనవఁడా సాహో! బాహులేయ! సాహో!' అని ఎలుగు ఎత్తి కులదైవం కొమరయ్యకు హెచ్చరికలు విన్నపాలు పలికినవాడై, నీమాలు తీర్చుకొని, రవసెల్లాకట్టి, బురుపొపని రుమాలు చుంగులుగా తలకుజుట్టి, పట్టుదట్టీలో పైడిగేరల కైజారమరించుకొని, వీసెవట్టు సింహతలాటరాయుడు ఈచేత ఆచేత నులివేడి వాడిమొనల బరిసె లందుకుని, –

కీకారణ్యముగా ఉన్న కోనలోనికి, కొమరయ్యను శకున మడిగేందుకు కదలిపోగా–

జడలమఱ్ఱిక్రింద నడిచేవేళకు, కొమ్మమీద నున్న కొండముచ్చు కిచకిచమని వెక్కిరించగా, మరో కొమ్మవారను పల్లరులు కొడుతూ భూతపిల్లి గుబ్బుమనగా, గిజిగాడిగూడు పట్టుపెరిగిపోయి నేలరాలగా, పైడికంటి పలుకగా, కోకిల కాకిగోల పెట్టగా –

ఇదేమా అని, ఎడమకన్నదిరినంత అదరిపడి కొమరయ్యను ముమ్మారు తలంచుకుని అడుగుతీసి అడుగువేసి వేయంగనే –

చీపరలీవె ముంగాలికి చుట్టుకోగా తెగతెంపి – చీకటి మాను ఊతగా మలుపుతిరిగి, దాపలి తామరకొలనులో కాలుకడిగి కన్నుతుడిచి, వెలపలి గంగధారను ఒకపరి పుక్కిటబట్టి –

వెదురు గుములుదాటి, వేపల అడివిదాటి,

అదుగో – పొరువా తెక్కవాటు దూరాన, మొయిలు మెచ్చగా, మోదుగులు విచ్చగా, రాలినపూవూ చెదిరొచ్చిన రేకా పచ్చటి పసిమిగా ఎఱ్ఱాటికెంపుగా మూరెత్తు కంబళి పరచినట్టు – పట్టుకట్టంగా – ఆకడ – కస్తూరిపట్లు జేగుర్లు విరబోసి, మెలమెల్లన ఊగాడుతూ జేకొట్టుతూండగా, చిక్కటి, ముదురుపచ్చ గొడుగుపట్టినట్లున్న గున్నమామిడి నీడను, బులి బుల్లి పడగల బాలనాగులు పారాడుతూండగా, తన కులంనాయకులు నీమంతప్పక కొలుచుకుంటూన్న జేజే, తనకంటికి కప్పురరేక కొమరయ్య కనుకలికాగా –

కొమరయ్యా - శరణన్న వాక్కు వెంబడే కొండలు దద్దరిలే హుంకారం కోనంతటా కలయజుట్టి మోగగా, లేడికి మల్లే ఎగిరి, సింగపుదుముకు దుమికినాడు మనుమంచిరాజు.

అయ్యపాదాల దరిని, ముమ్మొనవాలుకు బరాబరులుగా, మోకరిల్లి కొలుచుకొంటూ ఉన్న వయసొచ్చిన పడుచూ, సరసనన్ను వనరైన చిన్నవాడూ, వెరసి - వెరసి ఆ బొబ్బరింతకు ఉలికిపడి, - ఆ దుముకుడు వినీవినంగానే అయ్యపాదాల మీద తామర రేకలుగా ఉంచినచూపులు చెంగుమనంగా -

తన తోడబుట్టినదాని కాళ్ళ పసుపూ పారాణీచూసి - కంటి కాటుకరేకచూసి, కల్యాణతిలకంచూసి, చెదరని ఆ చూపుచూసి పెదవిని చిరునవ్వుచూసి, మనుమంచిరాజు - కొండమల్లారా! - అని దద్దరిల్లి బరిసెలు తిప్పి, కుడిఎడమ నేలను దిగేసి, బరిసె కానులకు ఊతంగా అనుకుని, కూలబడేపాటు తప్పుకుని నిప్పులు చెరిగేకనులను ఱెప్పలతో చిక్కబట్టి -

ఏవమ్మా ఐదువరాలా! నీవు, మాగూట పెరిగిన చిలకవేనా? మా తల్లి కడుపు చలువవేనా?

దైవాని కొక్కడికే శిరసువంచిన గండరగండడు, నన్ను కన్నవాడు గారాబం చేసిన కన్నెకోమలివేనా?

నాతోడబుట్టిన మాచలదేవివేనా? - అనంగా, -

- ఆ చిన్నదాని వాలుగన్ను చికిలిచేసిన కైజారై తామసాన తళుక్‌మనంగా, తగవుకాదని, తలవంచి పెదవి మనిపంటను అదిమి అన్నకు మౌనాన మ్రొక్కి, మెడనున్న తాళి మునిగోట రాపాడుతూ, తనలో తాను ఏమనుకున్నదీ -

కొమరయ్యా! కోనలేలు మొనగాడు నా నుదిటి కుంకుమ చూసి కోపగించుకు న్నాడు; వెన్ను చలవున్న బిడ్డ మా తల్లికడుపున నాకన్న ముందుపుట్టిన బిడ్డ, దండించే దర్పాన పలుకుతున్నాడు; మా కులానికి మాణిక్యం, తానొకడేనా, - మము కన్నవాడు, మిము కన్నవారి అడుగులకు మనసుతో మడుగులొత్తుతూ, కాపురముచేసిన, భవనానికి అంతటికీ యింక మణిదీక తానొక్కడేనా-? అయ్యా, - మా అన్న నిన్ను మరచెనా, నన్ను మరచెనా - నీ సన్నిధిలో, యింతమాట ఏలపుట్టెనయ్యా!

మాతండ్రి శివలెంకజోదు, ఫలవృక్షాలు పెంచెనే కాని, పగలు పెంచలేదే - తాను, లోకానికి పెట్టనికోటగా ఉంటినని గురుతుగా కోటకట్టించెగాని, నన్ను పెంచిన వీరుడు లేదన్న బిరుదుకు కాదే!

పులికి పురుడుపోసి, కూనలకు అంటుమామిడితోట ఆటపట్టుచేసిన జోదు - జాతిగల నాగులు గట్టునూ పుట్టనూ పట్టి పోనేల అని, చందనవనం నిర్మించిన జోదు - మాతండ్రి పెంపకాన, పులులు గంగిగోవులైనాయి. కాని పుత్రుడీ తీరాయె నేమయ్యా!

నిలువ నీడకలదని మన సీమకు, యీ వీరుడు తరలి వచ్చినాడు - మా అన్న అదిరించినాడా? విలువిద్దెలో తనకన్న ఘనుడాయెనని, ఆతని రాసిరి తనకు తలవంపులై, ఆతని మగటిమి, తనపదవికి చేటౌనని, పరువుమాలి పట్టి చెరనుంచెనే! యీ దిసిరాజు వంశోద్ధారకుడు.

చెరనుంచినా, మోము వాడలేదని ఎందుకంత అక్కసు; నీడ నిప్పచ్చరమైనా, మోమోడని ఎందుకంత పగ-మాసీమలోవారు, చిట్టెలుకనైన పట్టి నరకాన వేయరే. ధిక్ - మా అన్న మనిషిజన్మ ఏల ఎత్తెనయ్యా! -

ఈ వీరుడి తలదీయించు తలపు మా అన్నకు కలిగినది; ఆ పాపము, తన దొక్కడిదే కారాదని, లెంకలతో, గుసగుసలు పోయినాడు. మెడలు విరిచి, మేలుజేసేనని ఆసజూపి, బెదరించి, వారిని ఆకట్టినాడు; కాని, మాలెంకలు తల్లీ తోడూ కలిగినవారు - దైవాన్ని మరువనివారు నాకడ వాపోయినారు; శివలెంకజోదు కులాన ముసలము పుట్టెనమ్మా అని అంగలార్చినారు. ఏలినవాని మాటకు ఎదురాడలేము; ఆ వీరుని హతమార్చలేము. చెట్టుకొకరముగా చెదిరిపోయాము తల్లీ మాకు సెలవిచ్చి పంపవమ్మా అని కంటతడి పెట్టినారు. యింతచేటు మా కులానికి మంగళమా అయ్యా! -

ఆ అన్నకు తోడబుట్టినదాన్ని నేనేమి చేసితి నందువు. అంబ పాదముల సన్నిధిని ఉన్న, మా తండ్రిని తలచుకొన్నాను. మహాదేవుని స్ఫటికహారంలో మణిపూసగా కుదురుకొన్న దేసిరాజుకు కైమోడ్పులిచ్చినాను. అయ్యా నీపేరు పదింబదిగ గుణించుకొంటూ ఆ వీరుని చేరబోయినాను. తల తడివి బాసచేసినాను. చేత చేయందుకొని ఈ తావుకు తోడి తెచ్చినాను. కొమరయ్యా, నీవు ఔననంగా, ఆ కులానికి కోడలినైనాను.

ఈ వీరుడి తలకాచి, మా అన్న తప్పుకాచినాను.

యిది - తగవు కాదా అయ్యా!

విని విని, పాము కబుసమల్లే మెరమెరగా గిజ గిజ మనినాడు, మనుమంచిరాజు.

కొమరయ్యా - మాగూట పలుకనేర్చిన చిలుక మనసు మెలివేసి దబ్బరలాడుతున్నది! - అనగా - ఆ చిన్నది.

అయ్యచేతి ముమ్మొనవాలు, మొక్కపోయినదా - స్వామికి సత్తెము తప్పెనా, సత్తువ తప్పెనా - తాను మెచ్చని మనువా మాది. అన్నా, నాసరసనున్న పెండ్లికుమారుని, బావా అని పలుకరించి, పగ కన్నుగప్పినా పరువుమాలిన వాడను కానని తెలియజెప్పుకో. శివలెంకజోదు కన్నవాడు - బైసిమాలినవాడు కాడని కొమరయ్యకు మనవిచేసుకో - చిట్టెడు పసుపూ, గోరంత కుంకుమా పెట్టి, చెల్లెలా క్షేమంగా పోయిరావమ్మా, అనినన్ను సాగనంపు, అని బ్రతిమాలింది.

మనుమంచిరాజు, వేయిపిడుగుల పెట్టున ఘూర్ణిల్లినాడు; బరిసె అందుకుని, మునివ్రేలు గీరుకుని నెత్తురోడించి రక్తస్పర్శ నేలపాలు చేసినాడు; కొమరయ్యా, మా కులానికింక నేనొక్కడనే - అని రివ్వున మ్రొక్కి వెనుదిరగగా - ఆ చిన్నది - అన్నా! మీ కులానికి నీ వొక్కడవే కారాదు. నీ యిలు తామరతంపరకావలె - నీ లోగిలిలో కట్టిన ఉయ్యాలలో ఉంగా అన్న పసిపాప మేనత్తకు కోడలు కావలె.

కల్ల! -

అన్నా! కొమరయ్య సన్నిధిలో కోరిన కోరిక కల్ల కాదన్నా! నీ మనసు నేను మార్చలేను. నీ అక్కసు నేను తీర్చలేను, నా కొమరుడు కోడలూ మనసార ఒక చిన్న మగవానిని కననీ - ఆ బాలపాపడు తాతా అననీ - అప్పుడీ బింకమూ హుంకరింపూ ఏమౌనో.

ఆ చినదాని, పెదవిదాటని చిరునవ్వు, అన్నకంట పడలేదు. వెనుతిరిగినవాడు, మును తిరుగలేదు. బావను పలుకరించలేదు.

మాచలా! కొమరయ్యకు నరబలి హితవుకాదని – తునుమాడక విడచినాను, నాకు కానివారు మా సీమలో – ఉండరాదు; అని అడుగు ముందుకు వేసినాడు. అందుకు ఆ చిన్నవాడు చిన్నబోయినాడు. ఆ చిన్నది చిరునవ్వు మానలేదు. తల్లి పసిపాపను లాలించిన తీరున మరీ మరీ మక్కువగా ఏమన్నదని! అన్నా! నేను నిదుర మేలుకొనిన వేళకు – గూబకూసింది. నీ నెత్తురు కళ్ళజూసినాను! నీకు కానిదాన వనిపించుకున్నాను! కాని, అడుగు ముందుకువేయకు. ఆరు నొక్క అడుగుపడితే, – కావలసినవారు కలకాలం దూరమయేరని, కులము స్వాములు చెప్పలేదా? అన్నంతలో మనుమంచిరాజు – ఆగి మెరుపల్లె అటుతిరిగీ తిరుగుతునే, బాకులందుకుని ఒకుమ్మడిని విసిరినాడు! దూసుకువచ్చిన బాకులు ఆ చిన్నది అలవోకగా ఒడిసిపట్టి అన్నా! ఇవి నీ అల్లునికి అరణమనుకునేను – అని సుతిమెత్తనగా పలికి, ఆ బాకులు సరసనున్నవానికి అందించి – పిడికళ్ళు ఆరవిప్పింది. బాకులందుకొన్న, ఝుడితిలో, అంచులు గీపాడగా, మాచల చేతులు, గీరల నెత్తురులు కమ్మి, నీరెండసోకిన కెందామరలై, చిరుగాలికి, రవంత కదలు తంగేడు గుబురులై – నులివేడి జేగురు ముద్దలైనవి. ఆ అరచేతులు పచ్చపట్టుమీద అద్ది – మాచల మననం చేసునుగదా.

కొమరయ్యా – ఆడితప్పనివాడు మాతండ్రి – అంతవాడి కొడుకు, అన్నమాట తప్పనివాడు మా అన్న – కాని, ఆవేశాన పలికిన పలుకు ఫలించరాదు. అన్నకు తోబుట్టువు మీది ఎక్కువ నేలపాలు కారాదు. నీకు నీడపట్టి, కొలుచుకునే లేమావితీరున, మా అన్నమనసు, కలకాలం, చిగురువాడక, పూతరాలక, కసటుదనంమారి తీయగా ఉండవలె – మా అన్నచూపులు, ఎత్తివచ్చిననాడే వేడీ రగులుమాసి రవపాళపుమంచున తడిసిన మల్లెలు కావలె – ఆ కనులు మెలమెల్లన విప్పారి చల్లగా, చెల్లెలి నాదరించవలె – అయ్యా, నాతోడబుట్టినవాడు, నాకు దీవెన కావలె! –

మామిడి చిగురు మెరమెరలాడింది; దూరాన కోయిల ఒక్కపలుకు పలికింది; కొమరయ్య పాదాల చేరువను పారాడు బాలనాగు, బుల్లిపడగ విప్పి తొలిసారి బుసకొట్టింది; కొమరయ్య మోమున, రవంత ఎండపొడ కమ్మింది.

మాచల వంచినతల ఎత్తిచూసింది; మనుమంచిరాజు కనువాటయినాడు –

ఎండ కన్నెరుగనిదానా, ఏలినవాని గారాల చెల్లెలా – నమ్మి నాదానివైనావు; అన్నకు కలకాలము దూరమైనావు; చింతలేదుగద! చిరునవ్వు మానవుకద! – అని ఆ చిన్నవాడు, మిక్కిలి దువ్వగా; చిన్నది, కనులార కలకలలాడింది. ఇద్దరూ కలిసి కదలినారు.

అక్కడ, కోటలో, మనుమంచిరాజు, చేయి చెక్కిట నుంచి, తెప్పవాలని మగతలో మనసు ఎదురుతిరిగిన మైకంలో కూలబడి ఉన్నాడు. మాతల్లీ నువ్వు లేనికోటలో పట్టపవలే చీకటులు కమ్మెనే – అని పలవరించినాడు; ఎంత కొడికట్టినావే – కులనాపకురాలా! అని పలవరించినాడు. కొమరయ్యా నేను చేసిన పాపమేమి, నాకీ శాపమేమి – అని వాపోయినాడు.

కొమరయ్య కోనకు వేకువనే పైనమైన ఏకిమీడు - కలనైన ఎన్నడూ, నడకలో నడవడిలో దుడుకుతనం సోకని మొనగాడు కాలు నిలువనటుల, ఎవరో వెన్నంటి తరిమినటుల, హుటాహుటి కోటకు తిరిగివచ్చెనదేమో - పలుకరించిన సామంతులను కంటజూడడాయె. లెంకలు బరాబరులు చేయగా, గమనింపు లేదాయె. కోనలో ఏమి వింత పుట్టెనో అని, మనుమంచిని ఎత్తిపెంచిన కొలువుకాడు. శివతోటి గుడ్లనీరు కుక్కుకున్నాడు. తానూ ఓ మూల కూలబడినాడు.

మనుమంచిరాజు, కలో మెలకువలో తెలియని అయోమయంలో పడివున్నాడు. అదిగో కొమరయ్యకోన, రుతువులు తిరిగిన నిగారింపుమీద ఉన్నది; ఆ నీడలో తన చెల్లెలు - అద్దాలలో, బాలపాపడు; వాడేనా, తనకు కాబోయే అల్లుడు - కాదు - ఎన్నటికీ కాదు; తన యిల్లాలు గొడ్రాలు! -

ఉయ్యాలలో పసిపాప కెవ్వుమన్నది - అదేనా - మాచలకు కోడలు? కారాదు; ఆ బాలుణ్ణి బ్రతకనీయరాదు.

కోనలో నరసంచారం లేదు. తీవెల ఉయ్యాలలో బాలుడున్నాడు; తాను ఎత్తుకొనిపోయి, పులులు కాపురమున్న మామిళ్ళలోకి విసిరివేసినాడు; తన చెల్లెలి గర్భవాసము తుడిచిపెట్టినాడు. తనకూతురు మాచల కోడలు కానక్కరలేదు.

ఉయ్యాలలో బాల ఏదీ - పులి కరచుకు పోయినదని - గగ్గోలు; కొండలపెట్టు దుఃఖం అంతలో శాంతి. తనకు కూతురూ లేదు, అల్లుడూ లేదు.

లేడా? - మరి వాడెవడు - పులిమీద కోనలో స్వారిచేసేవాడు మాచల నాతండ్రీ అని పలుకరించినవాడు - అమ్మా! మా మామకూతురు, నాకు కనుపండువుగా, సిగలో జాజులు, మల్లెలు తురుముకున్నదా లేదా - తన్ను తాను తెలియలేని అహంకారి, మీ అన్నకన్న కూతురు - ఆ అమాయకురాలు ఏదమ్మా - అని అడుగుతున్నవాడు - వాడా తన అల్లుడు - పూవులలో తానొక పూవుగా తీవెలో తానొక తీవెగా, మలగిపోయిన ఆ చిన్నది - వాడు చేయందుకొనగ కనులప్పగించి కిలకిలలాడిన చిన్నది - తన కన్న కూతురా? - కాదు. కారాదు; ఆ మనువు నిలువరాదు.

కైజారందుకొని, కత్తిదూసి, ముందుకు దుమికినాడు; చందనవనంలో నాలుగు లెక్కలువచ్చినట్టు దూసుకువచ్చి, పడగలతో కోటకట్టి - కాపు కాచినవి; మా తండ్రి చేసిన మేలు తలచి తొలగిపొమ్మని చేయెత్తి మొక్కినాడు. నాగులు లేవు. యిఁక తెగవేయవచ్చు. ఇంకొక్క దుముకు దుమికినాడు; నేల యీనినట్లు పులులు వచ్చిపడినవి. తన చేతివాలుకు జంకలేదు - తాను హుంకరించగా ... వాని వాలములైన బెదరలేదు. తనకు కాలుచేతులాడలేదు. తన కూతురూ, మాచల కన్నవాడూ చిరునవ్వుతో ముందుకు అడుగువేసినాడు. తానేడీ - ఏమైనాడు - ఆ చిన్నదాని సందిట బాలపాపడు - తానేనా - చిన్నా, ఆ కోరచూపు చూడు. ఆ మూతి బిగింపుచూడు, ముమ్మూర్తులా, మా మామగారే - అని, మాచల కన్నవాడు, పలుకుల కికురించినది, తన్నేనా -

ఓరి గబువాయి - మా అన్న, నీ అద్దాల పాపడు కాగానే అంత లోకువాయెనటరా - కన్నె నిచ్చినవాడురా. గారవించవలసినవాడురా అని, మాచల, వానిని చనువుగా

ఆదరించి, అక్కున జేర్చుకొన్నది తన్నేనా-? అత్తా, నీ అన్నకు నీవన్న ఎంత అపేక్షో మాకు తెలియదా, నీవు అందుకోగానే, పిడికిళ్ళు బిగించినాడు చూడు. కాళ్ళా చేతులా నీతో యుద్ధమాడుతున్నాడు చూడు - అని తన కూతురేనా పలికింది. ఓసి నాపసానీ మా అన్నకు నేనన్న ప్రాణమే. చిన్ననాడు నన్నెత్తి ముద్దుచేసినాడు; తన అంతవానిని నేను బాలపాపనుచేసి ముద్దులాడుటా అని అయ్యకు రోషము వచ్చినదే - అని హత్తుకొన్నది - తన్నేనా - అన్నా! ఆడపడుచు ఎల్లకాలమూ తమ కనులముందరనే ఉండవలెనని కన్న యింటివారు కోరుట సహజమే. తల్లి మొగమెరుగని దానిని దాదులకు అప్పగించక తండ్రి పోషణ చేసినాడు. నీవు క్రింద దించక లాలన చేసినావు. నీ వన్న ప్రాణము కాదా; నాకు, అమాయకుడా, చెల్లిలిని విడిచివుండలేక బావ మీద హుంకరించినావా అన్నా, నీకా వీడిమీద పగ - విలువిద్దెలో నిన్ను మించెనని కాదు - మరే అందుకూ కాదు.

నన్నావీరుడు చూడగనే నాకన్ను అతని పరమైనది. అది నీ కంటపడి, నా చెల్లెలు నాకు దూరమౌనేమో అని, మనసు రగిలినది. మన కులాన ఎవరికీ ఏనాడూ పుట్టని బుద్ధి నీకు పుట్టినది - కాని, మన యిలవేల్పు కొమరయ్య కరుణించినాడు. నా కోరిన కోరిక సఫలము చేసినాడు. అన్నా నిన్నొక్క క్షణమైన ఇక విడిచి ఉండనన్నా అని పలుకుతూన్నది మాచల.

కరడు కట్టుకొనిపోయిన మనుమంచిరాజు దద్దరిల్లి మెలకువలోకి వచ్చినాడు. అప్పటికి బారెడు ప్రొద్దు ఎక్కలేదు. పచ్చని చిగుళ్ళమీది చిక్కడి ఆరలేదు. అమ్మా మాచలా అని బొబ్బరించినాడు. తానున్న చోటునుంచి ఉరికినాడు.

మాచలా, ఆ వీరుడూ, పదిబారలు సాగినారు. పళ్ళు బిగినిపట్టి నిలిపినా దుఃఖము ఆగలేదు. అన్నా అని ఎలుగెత్తింది మాచల - రావాకువలె కంపించిపోయింది.

అమ్మా! అని బదులుపలికినాడు మనుమంచి - మాచలను తన అక్కున జేర్చుకుని మాతల్లి మా అల్లుడు ఏ చెట్టు నీడనో ఊయల లూగరాదు. కోటకువచ్చి - ఊయల కట్టవమ్మా! నేను కోనవీలు మొనగాడిని కానమ్మా - దర్వాన పలుకుతుండలేదమ్మా - నేను మా మేనల్లునికి, లెంకను, పిలిచి పిల్లనిచ్చెనని చేతులు కట్టుకొన్నవాని మీద - అలుక ఎందుకమ్మా - బావా - నేను పనికిమాలినవాడినే కాని, నా బిడ్డ, శివలెంకజోరు మనుమరాలేను; - నినుబోలిన వీరునికి పరువైన కోడలేను - అని పలుకగా - మాచల సాగరమంత సంతోషంతో - కొమరయ్యా! - అని కనుల ముత్యాలు జాలువారగా - తన సరసనున్న వాని చేయందుకొని, అన్నకు సరిజోడుగా మ్రొక్కినది.

*[ఆంధ్రవారపత్రిక(?) 16-12-1959.]*

★ ★ ★